క్లుప్తంగా

విజేతలకు బహుమతులు



ఆగిరిపల్లి: మండలంలోని చొప్పరమెట్ల తాడేపల్లిలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలి పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు కేకేఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొసరాజు కోటేశ్వరరావు రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలి



కోకిలంపాడు(తిరువూరురూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో సీ, డీ గ్రేడ్లలో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తిరువూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సాంబశివరావు సూచించారు. ఆదివారం కోకిలంపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. నూరుశాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

బెల్లపు ఊట స్వాధీనం



తిరువూరు: ఏకొండూరు మండలం గొల్లమందలలో కాపుసారా బట్టీపై తిరువూరు ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 150 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. కాపుసారా తయారీ, అమ్మకాలు చట్ట విరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మతల్లి జాతర



బలివే (ముసునూరు): బలివే రామలింగేశ్వరాలయంలో స్వామివారికి ఆదివారం రాత్రి బలి హరణ, హోమం, ధ్వజారోహణ నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. అనంతరం దేవదాయ శాఖాధికారులు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో గంగానమ్మ జాతరతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమైనట్లు ఈఓ పామర్తి సీతారామయ్య, గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ తెలిపారు. బలివేలోని మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి కావచ్చినట్లు ఉత్సవాల నోడల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్ కుమార్ తెలిపారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఏర్పాట్లు వేగంగా చేస్తున్నామన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలోఆలయ ప్రాంగణంలోనూ, ఉత్సవ ప్రాంగణంలోనూ బారికేడ్లు, లడ్డూ ప్రసాదాలకు ఏర్పాట్లు చేయించామని, పుణ్య స్నానాలకోసం జల్లు స్నానాలు, తాత్కాలిక దుస్తుల మార్పిడి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయించామన్నారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో బలివే రేవుకు నీరు తరలించగా, ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి రజతోత్సవం




ఆగిరిపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని పరిశుద్ధ జాన్ సీఎస్ఐ చర్చి రజతోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఎస్ఐ కృష్ణ, గోదావరి జిల్లాల అధ్యక్ష ఖండం పీఠాధిపతులు డాక్టర్ జార్జ్ కోర్నేలియస్, జాషువా కుమారి పాల్గొన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించారు. సాయంత్రం బొబ్బర్ల సురేష్ ఆధ్వర్యంలో చర్చి వద్ద ధనవంతుడు-లాజర్ నాటకాన్ని ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, ఎంపీటీసీ సాధం గోపి, కంబాల ప్రదీప్, తాళ్లూరి ఆదాం, వాకా సక్కేశ్వరరావు, బొబ్బర్ల సురేష్, బెజవాడ హర్ష, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.


ప్రమాదాలకు వంతెనలు

- బుడమేరుపై హైలెవల్ వంతెనల నిర్మాణంలో నిర్లక్ష్యం
- ప్రతిపాదనల దశలోనే ఆగిన వంతెనలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జి.కొండూరు: దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెనలపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులు ఎస్టిమేషన్లు వేసి ప్రతిపాదనలు పంపారు. నిధులు తేవాల్సిన ప్రజా ప్రతినిధుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప చేతలు గడప కూడా దాటడంలేదు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనలు కూలి పెను ప్రమాదాలు జరగక ముందే కొత్త వంతెనలు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హెచ్ ముత్యాలంపాడు వద్ద కూలేందుకు సిద్ధంగా వంతెన



హెచ్ ముత్యాలంపాడు వద్ద చప్టాపై భారీ వాహనాలతో నిలిచిన ట్రాఫిక్

హెచ్.ముత్యాలంపాడు వద్ద నిత్యం..

మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ బుడమేరుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి వరద ఉధృతికి గతంలో కుంగిపోయింది. అయితే రాకపోకలకు నిత్యం ఇబ్బంది తలెత్తుతుండడంతో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టి పూర్తయ్యే వరకు తాత్కాలిక నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రూ.55 లక్షల ప్రభుత్వ నిధులతో లోలెవల్ చప్టాను నిర్మించారు. దీనికి అప్రోచ్‌రోడ్డు ఏర్పాటుకు మరో రూ.16 లక్షలు ఖర్చు చేశారు. అయితే బుడమేర వరద ఉధృతి వల్లన కందులపాడు వైపు ఉన్న అప్రోచ్‌రోడ్డు గతంలో మూడు సార్లు కొట్టుకుపోయింది. ఇక్కడ నూతన హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టేందుకు అధికారులు రూ.8.5 కోట్లకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపగా ఇప్పటికీ మంజూరు కాలేదు.



చిలుకూరివారిగూడెం వద్ద సగానికి కూలిన వంతెన

నిత్యం ట్రాఫిక్ జామ్..

తిరువూరు, మైలవరం నియోజకవర్గాలలో, విజయవాడలో ప్రముఖమైన కార్యక్రమాలు జరిగే సమయంలో ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను సైతం ఇబ్రహీంపట్నం నుంచి ఈ రహదారి వైపు దారి మళ్లిస్తారు. ఈ క్రమంలో నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో లోలెవల్ చప్టాపై నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు పాత వంతెనపైనే ప్రయాణిస్తున్నారు.



వెంటనే వంతెనను నిర్మించాలి

మా గ్రామాన్ని ఆనుకొని బుడమేరుపై ఉన్న వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియనిపరిస్థితి. వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లతో వెళ్లాలంటే భయమేస్తోంది. వంతెన కుంగిపోయి ఎగుడుదిగుడుగా ఉన్నందున గ్రామానికి వచ్చే కొత్తవాళ్లు రాత్రి సమయాలలో ఈ వంతెన మీదుగా వస్తే వాగులోనే పడిపోతారు. ప్రభుత్వం వెంటనే కొత్త వంతెనను నిర్మించాలి.

– చిలుకూరు రామ్మోహన్‌రెడ్డి, గ్రామస్తుడు, చిలుకూరువారిగూడెం



ట్రాఫిక్‌జామ్‌తో నరకయాతనే..

హెచ్ ముత్యాలంపాడు వద్ద పాత వంతెన కూలేలా ఉంది. పక్కనే కట్టిన చప్టా నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ద్విచక్ర వాహనాలు వెళ్లే అవకాశం లేదు. కార్లు సైతం పాత వంతెనమీదుగానే వెళ్తున్నాయి. వంతెన ఎప్పుడు కూలుతుతందో కూడా తెలియదు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త వంతెనను నిర్మించాలి.

– వేములకొండ విష్ణు, గ్రామస్తుడు, జి.కొండూరు

కొత్తగూడెం వద్ద ఘోరం..

మైలవరం మండల పరిధి పుల్లూరు శివారు కొత్తగూడెం, చిలుకూరివారిగూడెం గ్రామాల మధ్యన బుడమేరుపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. ఇటీవల వచ్చిన వరదలకు వంతెన ఒక వైపు కూలిపోయింది. అయినప్పటికీ ఈ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.25 లక్షలతో అంచనాలు ఆచరణలోకి రాలేదు. దీంతో భారీ వాహనాలు వెళ్లే వీలు లేకుండాపోయింది. మైలవరం నియోజకవర్గంలో బుడమేరుపై ఈ రెండు వంతెనలే కాకుండా పాత, కొత్త చంద్రగూడేల మధ్యన ఉన్న వంతెన, మైలవరం,వెల్వడం గ్రామాల మధ్య వంతెన కూడా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అధికారులు, కూటమి నాయకులు యథేచ్ఛగా ఉల్లంగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్టీటీపీఎస్ సంస్థకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోకి నేరుగా వెళ్లి ప్రచారం చేయడం చూసి రాజకీయ మేధావులు ముక్కున వేళ్లేసుకుంటున్నారు. అధికారుల తీరు కూడా దారుణంగా మారింది. ఎన్నికల కోడ్‌లో భాగంగా జాతీయ, రాజకీయ రంగ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన అధికారులు కూటమి నాయకుల బ్యానర్లు కొన్నిచోట్ల తొలగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత సంక్రాంతి సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, పవన్‌కళ్యాణ్, బాలకృష్ణ తదితరులతో ఏర్పాటు చేసిన బ్యానర్ ఎన్నికల సందర్భంలో కూడా తొలగించకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

91 మంది యువకుల రక్తదానం

తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరు సిద్ధార్థ విద్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చేయూత చారిటబుల్ ట్రస్టు, ఎన్టీఆర్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ చెరుకూరి రాజేశ్వరరావు ప్రారంభించారు. 91 మంది యువకులు ఈ సందర్భంగా రక్తదానం చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి నేత్ర సంబంధ రోగులను, మధుమేహ రోగులను పరీక్షించారు. తిరువూరు ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

మహాశివరాత్రికి 'బలివే' సిద్ధం

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- బలి అనే రాజు పరిపాలించిన ప్రాంతమే బలివే

ముసునూరు: దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న బలే శ్రీరామలింగేశ్వరాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏటా మహాశివ రాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాగా ఏర్పడిన తర్వా త మూడో ఏడాది ఈనెల 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు జరుగుతుంది. ఉత్సవాలకు నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రత్యేకాధికారిగా, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ నోడల్ అధికారిగా, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఈఓ పామర్తి సీతారామయ్య నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాధాన్యత ఇదీ..

ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలోని శ్రీరామ లింగేశ్వరాలయం. ఈ ఆలయం పూర్వపు కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నడుమ, ప్రాచీన తూర్పు వేంగీ చాళుక్యుల రాజధాని వేంగీ పురం (నేటి పెదవేగి)కి అతి సమీపాన కృష్ణా జిల్లా, ముసునూరు మండలంలో తమ్మిలేరు ఒడ్డునే ఉండి, పచ్చని వరి, మొక్కజొన్న పంటచేలు, కొబ్బరి, అరటి, ఆయిల్‌పామ్, నిమ్మ తోటల నడుమ ప్రకృతి రమణీయతతో, ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో విరాజిల్లుతోంది.

ఆలయ స్థల పురాణం..



బలే రామస్వామి మూల విరాట్ స్వరూపం

శ్రీ రామలింగేశ్వరాలయం త్రేతాయుగంలో లింగ ప్రతిష్ఠ జరుప బడినదిగా ప్రతీతి. శ్రీరామచంద్రుడు రావణాసుర సంహరణానంతరం బ్రహ్మ హత్యా దోష నివారణకై విశేష, మహా స్థలాల్లో ఈశ్వర లింగ ప్రతిష్ఠలు చేసుకుంటూ, అయోధ్యకు పయనమయ్యారు. మార్గ మధ్యంలో బలివే ప్రాంత మహారణ్యంలో విడిది చేసి, ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, శివధ్యాన దృష్టిగల భూమిగా గుర్తించి, ముగ్ధులై ఇక్కడే స్వామి వారిని పశ్చిమాభిముఖంగా ప్రతిష్ఠ చేయుటకు నిర్ణయించుకున్నారు. ఈ ప్రదేశంలోని శివలింగాన్ని శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన కారణంగా శ్రీరామలింగేశ్వర ఆలయంగా పిలవబడుతోంది.

బలి అనే రాజు పాలించడంతో..

తదనంతర కాలంలో ఈ ప్రాంతాన్ని బలి అనే రాజు పరిపాలించడంతో బలివేగా పేరొందింది. స్వామివారు పశ్చిమాభిముఖంగా సద్యోజాతమూర్తిగా, బ్రహ్మసూత్రము గల లింగాకార రూపంలో భక్తు అభీష్టాలు, సకల కోర్కెలు నెరవేర్చు మహానుభావునిగా వెలుగొందుచున్నారు.

- ఆలయ పునర్నిర్మాణం: ఈ ఆలయాన్ని 12వ శతాబ్దంలో కాకతీయాంధ్ర సామ్రాజ్య సైన్యాధ్యక్షుడు, నూజివీడు ప్రభువుల వంశ మూల పురుషుడు మేకా బసవ దండనాధుడు పునర్నిర్మాణం చేయించారని శిలా శాసనం ద్వారా తెలుస్తోంది.
- తమ్మిలేరు ఉద్భవం: లింగ ప్రతిష్ఠానంతరం క్షేత్రంలో స్వామివారి అభిషేకాలకు జలం కొరవడింది. విషయం గ్రహించిన లక్ష్మణుడు బాణం సంధించగా, పాతాళగంగ ఉద్భవించి, ప్రవహించనారంభించింది. తమ్ముడు వేసిన బాణంతో నీరు వచ్చినందున తమ్ముడేరుగాను కాలానుగుణంగా తమ్మిలేరు అనే పేరు స్థిరపడింది.
- అమ్మవారి ఆలయ నిర్మాణం: స్వామివారి ఆలయం చెంత, అమ్మవారి ఆలయం కూడా ఉండాలని, ఈ ప్రాంతానికే చెందిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ 2011వ సంవత్సరంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. బలే రామస్వామిని దర్శించుకున్న భక్తులంతా అమ్మవారిని దర్శించుకుంటారు. కార్తీక మాసంలో, దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తుంటారు.

472 మందికి పింఛన్‌లు, దుస్తుల పంపిణీ

మైలవరం: తన స్వగ్రామంలో ప్రజలు సుఖ సంతోషాలు, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మండలంలోని వెల్వడం గ్రామంలో ఆయన నివాసంలో రెండవ రోజు ఆదివారం గ్రామానికి చెందిన 472 మంది వృద్ధులు, వికలాంగులు, మహిళలకు మహాశివరాత్రి సందర్భంగా పింఛన్‌లు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు తమ పిల్లలను బాగా చదివించాలని తెలిపారు. మైలవరం మండలం ప్రజలు తమ పిల్లల్ని చదివించుకోవడానికి ఇబ్బందులు పడకుండా రూపాయి అదనపు ఖర్చులు లేకుండా ఎల్‌కేజీ నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ వరకు మైలవరంలోనే చదివించుకునే అవకాశం ఉందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సతీమణి విజయలక్ష్మి, లకిరెడ్డి సిద్ధార్థరెడ్డిలు పింఛన్‌లు అందజేశారు. కార్యక్రమంలో లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి, లకిరెడ్డి ప్రసాదరెడ్డి, రోహన్, తిరుపతిరెడ్డి, సీతారామిరెడ్డి, గుర్రాల శ్రీనివాసరెడ్డి, పీ గోపాల్, చంద్రం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, వృద్ధులకు పింఛన్‌లు, వస్త్రాలు అందజేస్తున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి

పరీక్షలంటే భయం వద్దు

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు భయపడవద్దని, ఇష్టపూర్వకంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గడ్డం బాల కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం తిరువూరు శ్రీనిధి టెక్నో స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్దిష్ట ప్రణాళికతో, క్రమశిక్షణతో చదివిన విద్యార్థులే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని, మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేస్తే ప్రయోజనం ఉండదని సూచించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. పాఠశాల కరస్పాండెంటు కిషోర్ బాబు, డైరెక్టర్ మహేష్, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం

నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు

నూజివీడు: ఈనెల 27న నిర్వహించే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సామగ్రితో పాటు బ్యాలెట్ పేపర్లు సైతం నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్నాయి. నియోజకవర్గంలోని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో ఓటర్లకు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను సబ్‌కలెక్టర్, ఇతర ఎన్నికల అధికారులు పరిశీలించారు. పోలింగ్ సమయంలో విధులు నిర్వహించే సిబ్బందికి, అధికారులకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. బ్యాలెట్ పేపర్లను తనిఖీ చేసి వాటిని పోలింగ్ స్టేషన్‌ల వారీగా ప్యాకింగ్ చేసే పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈనెల 26న సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

12 పోలింగ్ కేంద్రాలు.. 9,652 మంది ఓటర్లు..

నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలో కలిపి 9,652 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 12 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లో రెండు చొప్పున, నూజివీడు పట్టణంలో ఆరు పోలింగ్ స్టేషన్‌లను సిద్ధం చేశారు. బ్యాలెట్ పేపరుతో నిర్వహించనున్న పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బందికి శిక్షణనిస్తున్న అధికారులు (ఫైల్)

మండలం	పోలింగ్ స్టేషన్‌ల సంఖ్య	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
నూజివీడు	6	2,917	2,198	–
ఆగిరిపల్లి	2	1,097	553	–
ముసునూరు	2	886	447	1
చాట్రాయి	2	1087	466	–
మొత్తం	12	5,987	3,664	1

ఉత్సవాల్లో సారా, మద్యం విక్రయాలు నిషేధం



ముసునూరు: బలివే మహాశివరాత్రి ఉత్సవాల్లో మద్యం, కల్లు విక్రయాలు నిరోధానికి ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య చెప్పారు. ఎక్సైజ్ శాఖ నూజివీడు సర్కిల్ టీమ్ ఆధ్వర్యంలో సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వేల్పుచర్ల, బలివే గ్రామాల్లో సారా తయారీ నిరోధం, గంజాయి వంటి మత్తు పదార్థాల తరలింపుపై అవగాహన ర్యాలీలు, చైతన్య సదస్సులను ఆదివారం నిర్వహించారు. ఉత్సవ పరిసరాల్లో సారా, మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే 99495 39933 నంబరుకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న మట్టి మాఫియా

మైలవరం: చీకటి పడితే మట్టిమాఫియా చెలరేగిపోతోంది. మట్టి మాఫియాపై పోలీసులు, అధికారుల నిఘా పూర్తిగా విఫలమైందని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరికి రణగొణ ధ్వని తట్టుకోలేని గ్రామస్తులు తెల్లవారు జామున లారీలను అడ్డుకుని నిలిపివేస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం మండలం నుంచి మట్టిని లారీలలో అర్ధరాత్రి వేళల్లో మైలవరం మీదుగా జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. గత 20 రోజులుగా ఈ అక్రమ మట్టి రవాణా జరుగుతోంది. దీనికి అధికార పార్టీకి చెందిన చోటా మోటా నాయకులు అండదండలతో పోలీసులు కూడా ఉదాశీనంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెడ్డిగూడెం మండలం నుంచి మైలవరం మీదుగా రాత్రి వేళల్లో జరుగుతున్న మట్టి అక్రమ రవాణాలో లారీల ధ్వనితో మైలవరం భాస్కరనగర్ వాసులకు నిద్రాభంగమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మూడు మండలాల అధికారులు, పోలీసులు పట్టించుకోపోవడంపై ప్రజల నుంచి పలు విమర్శలు వస్తున్నాయి. దీనిలో వీరి భాగస్వామ్యం ఉందా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనివల్ల స్థానికుల ఇబ్బందులు తొలగుతాయంటున్నారు.



అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి రవాణా చేస్తున్న లారీ

1,005 మందికి వైద్య పరీక్షలు

నూజివీడు: ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో విజయవాడకు చెందిన శ్రీకర హాస్పటల్స్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె, లివర్, గ్యాస్ట్రిక్, గైనకాలజీ, ఆర్థో విభాగాలకు సంబంధించిన వైద్యులు విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో మొత్తం 1005 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ బీ లక్ష్మణరావు, పీఆర్వో రాజేష్, హౌస్‌కీపింగ్ అండ్ సెక్యూరిటీ ఇన్‌చార్జి ఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ అమరేంద్రకుమార్

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



తిరువూరులో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు విచ్చేసిన భక్తులు

తిరువూరు: స్థానిక పాతతిరువూరులో పునర్నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ, పోతురాజు, బొడ్డురాయి, ముత్యాలమ్మ విగ్రహాలకు విశేష పూజలు చేసి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. పలువురు భక్తులు బోనాలు సమర్పించి పొంగళ్లనివేదన చేశారు. తిరువూరు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. పూర్ణాహుతితో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ముగిశాయి.